ఇంటింటికీ ఓటరు చీటీలు

- పోలింగ్‌శాతం పెంపు, సజావుగా ఎన్నికల నిర్వహణకు చర్యలు
- 22లోగా పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు

జిల్లాలో ఓటర్ల వివరాలిలా..	
పురుషులు	: 3,50,509
మహిళలు	: 3,72,829
ఇతరులు	: 51
సర్వీస్ ఓటర్లు	: 930
మొత్తం	: 7,24,319
పోలింగ్ కేంద్రాలు	: 922


భైంసాలో ఓటరు చీటీలు పంపిణీ చేస్తున్న ఎన్నికల అధికారులు, బీఎల్‌వో

భైంసాటౌన్: ఈనెల 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయడంతో పాటు పోలింగ్‌శాతం పెంచేలా జిల్లా అధికారుల నుంచి బీఎల్‌వోల వరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు తుదిజాబితా విడుదల చేసిన అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితా ప్రదర్శించారు. అందులో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు పోలింగ్ చీటీలు పంపిణీ చేస్తున్నారు. ఈనెల 22లోగా చీటీలు పంపిణీ పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలు ఓటరు చీటీలు అందిస్తున్నారు. చీటీలపై ఓటరు ఫొటో లేకపోవడంతో బీఎల్‌వోలకు పంపిణీలో కొంత జాప్యం నెలకొంటుంది.

జిల్లాలో ఇలా...

జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల్లో మొత్తం 922 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా పోల్(ఓటరు) చీటీలు పంపిణీ చేయిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో చీటీల పంపిణీలో కొంత జాప్యం నెలకొంది. ఓటరు ఫొటో, ఇంటినంబరు లేకపోవడంతో పంపిణీకి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొత్త ఓటర్ల వివరాలు తెలియకపోవడంతో తెలిసినవారిని అడిగి, లేదా ఓటరు జాబితాలో ఫొటోల ఆధారంగా గుర్తు పట్టి పంపిణీ చేస్తున్నారు. దీంతో పంపిణీలో కొంత ఆలస్యమవుతోంది.

చిరునామా తెలిసేలా మ్యాప్...

ఈసారి పోల్ చీటీలపై పోలింగ్ తేదీ, క్యూఆర్ కోడ్, పోలింగ్ సమయం, ఓటరు ఫొటో, పోలింగ్ కేంద్రం సంఖ్య, ఎపిక్ నంబర్‌తోపాటు వెనకాల పోలింగ్ కేంద్రం మ్యాప్ ముద్రించి ఉంది. దీంతో పోలింగ్ రోజున ఓటర్లు చిరునామా కోసం ఇబ్బంది పడకుండా నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లేలా మ్యాప్ ముద్రించారు. మరింత సమాచారం కోసం బీఎల్‌వో పేరు, ఫోన్ నంబర్ సైతం ముద్రించారు.

చీటీతో కేంద్రానికి వెళ్లాలి..

ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం గుర్తించిన 12 కార్డుల్లో ఒకదానితోపాటు ఓటరు చీటీ తీసుకొని పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. అందులో భాగంగా ఇప్పటికే ఓటరు చీటీల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశారు. ఒకవేళ ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో లేకుంటే పోలింగ్ రోజున బీఎల్‌వోలను సంప్రదిస్తే చీటీలు అందిస్తారని అధికారులు పేర్కొన్నారు.

ఖానాపూర్‌లో పంపిణీకి నేడు గడువు..

ఖానాపూర్: మండల పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 40,281 కాగా.. వారిలో 19,495 మంది పురుషులు, 20786 మంది మహిళలు ఉన్నారు. మండలంలోని 50 పోలింగ్ కేంద్రాల పరిధిలో 50 మంది బీఎల్‌వోలు ఓటరు చీటీలను ఈనెల 17 నుంచి పంపిణీ చేస్తున్నారు. ఈనెల 21 వరకు ఓటరు చీటీల పంపిణీకి అధికారులు గడువుతేదీ విధించారు. అంగన్‌వాడీలు, మెప్మా ఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు, బీఎల్‌వోలు ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు 90 శాతం ఓటరు చీటీల పంపిణీ ప్రక్రియ పూర్తయిందని తహసీల్దార్ పరిమల్‌బౌమిక్ తెలిపారు.

ఇంటింటికీ తిరుగుతున్నాం

పోలింగ్ కేంద్రం పరిధిలోని కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు పోల్ చీటీలు అందిస్తున్నాం. అందుబాటులో లేకుంటే పోలింగ్ కేంద్రాల వద్ద మమ్మల్ని సంప్రదిస్తే చీటీలు అందిస్తాం. పోల్ చీటీతోపాటు ఓటర్ గైడ్ సమాచారం కూడా అందిస్తున్నాం.

– మాధురి, బీఎల్‌వో, భైంసా

వేగవంతం చేస్తున్నాం

ఈనెల 22లోగా ఓటర్లకు పోల్ చీటీలు పంపిణీ చేయాలని అధికారుల ఆదేశాలున్నాయి. ఈ మేరకు ఇప్పటికే చీటీల పంపిణీ వేగవంతం చేశాం. ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కృష్ణగౌడ్, పోలింగ్ కేంద్రాల సూపర్‌వైజర్, భైంసా

అభివృద్ధి కోసం కారుకు ఓటేయండి

- సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ
- నిర్మల్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి


సారంగపూర్: అర్కాయితండాలో ప్రచారం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

సారంగపూర్: అభివృద్ధి కోరేవారు కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఐకేరెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు 50 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని కేవలం బీఆర్‌ఎస్ హయాంలో గత పదేళ్లలో చేసి చూపామన్నారు. సోమవారం మండలంలోని 25 గిరిజన గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలతో ఆడబిడ్డల వివాహాలకు అండగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు జిల్లాలో 800 ఆలయాల నిర్మాణం చేపట్టామన్నారు. సరిహద్దు ప్రాంతంలో ఉన్న మహారాష్ట్ర గ్రామాల ప్రజలు తమను తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వారి వెంట అల్లోల మురళీధర్‌రెడ్డి, నల్ల వెంకట్రామిరెడ్డి, ఏఎంసీ అధ్యక్షురాలు ఆశ్రితా రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మాధవరావు, ఆయిటి చందు, మాణిక్‌రెడ్డి, నారాయణరెడ్డి, జీవన్‌రావు, రాజ్ మహ్మద్, పవార్ రాజు, తిరుమల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మామడ: కారు గుర్తుకు ఓటేసి నిర్మల్ ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని అల్లోల దివ్యారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొరిటికల్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమలో గంగారెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో ఎస్సీ కాలనీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు క్రిష్టారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, గంగాధర్, గంగారాం, జహీరొద్దీన్, అశోక్, సీరాజ్, ముత్యం, భూమన్న ఉన్నారు.

సోన్: నిర్మల్ ఎమ్మెల్యేగా ఐకేరెడ్డిని గెలిపించాలని మండల కేంద్రంలో సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్, కాంతయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రంజిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అల్లోల గౌతంరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ యు.సుభాష్ రావు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కె.దేవేందర్‌రెడ్డి, పాల్దె అనిల్, ధనె రవి, కోడె నవీన్, కుంట గంగాధర్, సప్పల రవి, నంద ముత్యం, పీఏ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: ఇంద్రకరణ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలోని వెంకట్రాదిపేట్, షేక్‌సాహెబ్‌పేట్, గుల్జర్ మార్కెట్, ఇస్లంపుర, బంగల్‌పేట్‌లో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సోన్‌లో ప్రచారం చేస్తున్న సత్యనారాయణ

'తెలంగాణను ఢిల్లీకి తాకట్టు పెట్టొద్దు'

నిర్మల్‌టౌన్: తెలంగాణను ఢిల్లీకి తాకట్టు పెట్టకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఓయూ జేఏసీ(టీఎస్ జేఏసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్చాల దత్తాత్రేయ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మయూరి ఇన్ హోటల్‌లో ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నాయకులను పట్టించుకోలేదన్నారు. కానీ కేసీఆర్ విద్యార్థి నాయకులకు ఎమ్మెల్యేలుగా అవకాశం కల్పించి.. వారి గౌరవం పెంచారన్నారు. నిర్మల్ జిల్లాను అభివృద్ధి చేసిన ఇంద్రకరణ్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, జేఏసీ విద్యార్థులు శివ, సందీప్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగాలి

- బీజేపీ నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


లక్ష్మణచాంద: బీజేపీలో చేరిన వారితో ఏలేటి


వడ్యాల్‌లో మాట్లాడుతున్న కవితారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్/లక్ష్మణచాంద: నిర్మల్‌లో కాషాయ జెండా ఎగిరేలా కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగాలని బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయా మండలాల నుంచి పలువురు బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణంలోని వైఎస్సార్ కాలనీ యువకులు, దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, మామడ మండలం తాండ్ర, ధర్మీనాయక్ తండా యువకులు బీజేపీలో చేరారు.

లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన యువశక్తి యూత్, జై శ్రీరామ్ యూత్, శ్రీరామ్ సేన యూత్, పవర్‌యూత్, బీఆర్‌ఎస్ నాయకులు మల్లయ్య, శంకర్, రమణ, వెంకటి, భూమేశ్, ప్రగత్, గంగయ్యతో పాటు 150 మందికి పైగా యువకులు నిర్మల్‌లోని ఏలేటి నివాసంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేశ్, నూతుల భూపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ముత్యంరెడ్డి, శ్రీనివాస్, మల్లేశ్, బడగారి మల్లేశ్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సురేశ్, టీకే మల్లేశ్, సాయన్న, భీంరెడ్డి పాల్గొన్నారు.

'ఏలేటి'ని గెలిపించాలి..

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి కవితారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు మండలంలోని వడ్యాల్, మునిపెల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీకి అవకాశం ఇస్తే నిర్మల్‌లో అభివృద్ధి చేసి చూపిస్తామని ఆమె పేర్కొన్నారు. వారి వెంట బీజేపీ నాయకులు భూపాల్‌రెడ్డి, రాంరెడ్డి, భీంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని పలు వార్డుల్లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్, దిలావర్‌పూర్ సర్పంచ్ జంగం వీరేశ్‌కుమార్, ఎంపీటీసీ గంగవ్వ ముత్యం, ధనె నర్సయ్య, పాల్దె ఉమా శంకర్, రాజు, నిరంజన్‌రెడ్డి, సాయినాథ్ పాటిల్, సుధీర్, యోగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే సేవకుడిలా పని చేస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్


ఇంద్రవెల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న జాన్సన్‌నాయక్

ఇంద్రవెల్లి: అవకాశం ఇవ్వండి.. సేవకుడిలా పని చేస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. సోమవారం జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి మండలంలోని గిన్నేర, బిక్కుతండా, శంకర్‌గూడ, చిన్న దనోర, దనోర గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని భీంనగర్, ప్రబుద్ధనగర్, బుద్ధనగర్‌లో ప్రచారం చేశారు. పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత, జెడ్పీ చైర్మన్ మహ్మద్ అంజద్, జాదవ్ శ్రీరాంనాయక్, మీర్జా జీలానిబేగ్, లఖన్, సుఫీయన్, కోవ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరితండా గ్రామంలో ప్రచారం చేశారు. వైస్ ఎంపీపీ బాలాజీ, జెడ్పీటీసీ చారులత రాథోడ్, శ్రీరాంనాయక్, ధరణి రాజేశ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

పెంబి: మండలంలోని ఇటిక్యాల్, కిష్టునాయక్‌తండా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో, ప్రవేశపెట్టిన పథకాలు ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జెడ్పీటీసీ జానుబాయి తదితరులున్నారు.

సినీ యాక్టర్ల ప్రచారం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వారసంతలో జాన్సన్‌నాయక్ తరుపున తెలుగు సినీ యాక్టర్లు ప్రచారం చేశారు. హీరో గోపీచంద్ నటించిన యజ్ఞం సినిమాలో విలన్‌గా నటించిన విజయరంగ రాజ్, ప్రొడ్యూసర్ బాలరాజుగౌడ్, తమిళ్, కన్నడ భోజపురి, తెలుగు సినిమాల్లో నటించిన రియల్ స్టార్ ఆజాద్ ప్రచారం చేశారు.

'ఎమ్మెల్యేగా ఒక్క అవకాశమివ్వండి'


మామడ: కిషన్‌రావ్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న శ్రీహరిరావు

మామడ: నిర్మల్ ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపుతానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు అన్నారు. సోమవారం మండలంలోని కిషన్‌రావుపేట్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి బీఆర్‌ఎస్‌ను సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రమణారెడ్డి, గంగాధర్, సంతోష్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్‌కాలనీలో సోమవారం శ్రీహరిరావు కూతురు మాధురి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోఫీనగర్‌లో శ్రీహరిరావు అన్న కూతురు హర్షిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రవీందర్ రెడ్డి, రాజేశ్వర్, రవి, రాజేందర్ పాల్గొన్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌లో ఉపసర్పంచ్ గడ్డం స్వామి, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గంగాధర్, ఎండీ గౌస్, శ్రీనివాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో కట్కం రాజారెడ్డి, షేక్ వసీం, కోడె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సయ్యద్ యూసుఫ్, కలీం, రమణ, రాజు, నర్సారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కలకు నీరు పోసిన సిబ్బంది


ట్యాంకర్ ద్వారా నీరు పోస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో హనుమాన్ ఆలయ ఆవరణలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నీళ్లు అందక ఎండుతున్నాయి. దీనిపై సాక్షిలో ఈనెల 20న 'ఎండుతున్న హరిత మొక్కలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు సోమవారం సిబ్బంది పంచాయతీ ట్రాక్టర్ ద్వారా మొక్కలకు నీరు అందించారు.

ఆలయానికి విరాళం

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ దేవి ఆలయ అభివృద్ధి కోసం భైంసాకు చెందిన తాడేవార్ తేజస్విని-కార్తీక్ దంపతులు సోమవారం రూ.ఐదు వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి దేవి ప్రతిమ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జుట్టు సుధాకర్, వెంకట్‌రావు, శివ, మహిపాల్, సాయన్న, అర్చకుడు నగేశ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ శ్రీరాజరాజేశ్వర, ఓలా శివాలయం, కుంటాల మహాదేవుని, ఉమామహేశ్వర ఆలయాల్లో సోమవారం కార్తీకమాసం సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలిరాగా.. ఆలయాల్లో మహారుద్రాభిషేకం, గణపతి, గౌరీ పూజలను అర్చకుడు వినయ్ పాండే, మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

వాహనాల తనిఖీ

కుంటాల: ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా డబ్బు, మద్యం తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ నైలు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం మండలంలోని కుంటాల–ఓలా రోడ్డు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వారి వెంట ఎస్సై హన్మాండ్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, బీర్నంది తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల రూట్ అధికారి చిక్యాల రత్నాకర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించారు. పోలింగ్ నాటికి ఓటర్లకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి హనుమంత్‌కు సూచించారు. బీఎల్‌వో రవీందర్, హెచ్‌ఎం సురేశ్ ఉన్నారు.

అప్పుల తెలంగాణగా మార్చారు

- తానూరు బహిరంగ సభలో మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావ్ చౌహాన్


మాట్లాడుతున్న అశోక్‌రావ్ చౌహాన్

తానూరు: ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ రాష్ట్రం ఏర్పాటు చేసిందని.. కానీ బీఆర్‌ఎస్ నాయకులు నిర్లక్ష్యంగా అభివృద్ధి చేయకుండా నియామకాలు చేపట్టకుండా అప్పుల తెలంగాణగా మార్చారని మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావ్ చౌహాన్ విమర్శించారు. సోమవారం రాత్రి తానూరులో ముధోల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భోస్లే నారాయణ్‌రావ్ పటేల్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మాట్లాడారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఆనంద్‌రావ్ పటేల్, మాధవ్‌రావ్ పటేల్ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


బీరవెల్లిలో కేంద్రం ప్రారంభిస్తున్న సీఈవో మల్లేశ్

సోన్: మండలంలోని న్యూబొప్పారంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏవో ఆనంద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రానికి తీసుకొచ్చే ధాన్యాన్ని ఆరబెట్టి తప్ప, తాలు, రాళ్లు లేకుండా చూడాలని రైతులకు సూచించారు. అనంతరం న్యూవెల్మల్‌లో గోలి దయాసాగర్ వేద వరి వంగడాలను సాగు చేయగా.. పొలాన్ని వ్యవసాయాధికారులు, రైతులు పరిశీలించారు. ఏఈఓ అంబాజీ, మాజీ సర్పంచ్ మౌలాన, వీడీసీ చైర్మన్ గంగారెడ్డి, రామారెడ్డి, షానాజ్ మోహీన్‌పాషా, మల్లయ్య, రాజలింగం, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి, కంకెట గ్రామాల్లో ఆలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో మల్లేశ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. తప్ప తాలు లేకుండా కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేశ్వర్, లస్మన్న, రైతులు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


లోకేశ్వరం: కవాతులో పాల్గొన్న సీఐ వినోద్‌రెడ్డి

నర్సాపూర్(జి): ధనం, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ఓటు వేయాలని నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని టెంబుర్నిలో సోమవారం బీఎస్‌ఎఫ్ బలగాలు, పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్సైలు రవీందర్, అరాఫత్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ముధోల్ సీఐ వినోద్ అన్నారు. సోమవారం మండలంలోని నగర్, గడ్‌చాంద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్సై సాయికుమార్, సిబ్బంది ఉన్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామంలో సోమవారం బీఎస్‌ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నిర్మల్‌రూరల్ సీఐ బి.శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఎస్సై యాసిర్ అరాఫత్, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి, ధర్మారం గ్రామాల్లో ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీఎస్‌ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. సోన్ ఎస్సై రవీందర్ సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో సోమవారం ఎస్సై హన్మాండ్లు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మాక్‌పోలింగ్

లోకేశ్వరం: మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో విద్యార్థులకు సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు క్యూలో నిలబడి ఓటు వేశారు. స్వచ్ఛ పాఠశాల కమిటీ అధ్యక్షురాలిగా ప్రస్నయ, ఉపాధ్యక్షుడిగా దీక్షిత్, విద్యా పర్యావరణం సభ్యుడిగా శ్రీహర్ష, ఆట సంస్కృతిగా సంజన, నీటి వసతిగా రిశ్వికను ఎన్నుకున్నామని ప్రదానోపాధ్యాయులు రమేశ్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, అశ్విని, పొశెట్టి, సంగీత, మౌనిక పాల్గొన్నారు.

బాలల హక్కుల దినోత్సవం

లక్ష్మణచాంద: పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవం, బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణప్రసాద్,సిబ్బంది పాల్గొన్నారు.

మామడ: మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జన్మదిన వేడుకలు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వాసవి ఉన్నత పాఠశాలలో సోమవారం గణితశాస్త్ర నిపుణులు చుక్కా రామయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కేక్ కట్ చేశారు. కరస్పాండెంట్ పోతారెడ్డి, సెక్రెటరీ జగదీశ్‌రెడ్డి, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోమహాయజ్ఞం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాయత్రి గోశాలలో గోపాష్టమిని పురస్కరించుకొని సోమవారం గోవు పిడకలతో గోమహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. ఇందులో లక్షా 8 గోమయ పిడకలు, ప్రమిదలను వినియోగించినట్లు పండితులు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని విజేత ఇంగ్లీశ్ మీడియం హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఆకట్టుకుంది. చంద్రయాన్-3 మోడల్‌తోపాటు గడ్డి కోతయంత్రం, పర్యావరణ మార్పుల ప్రాజెక్టు, మానవ రక్తప్రసరణ వ్యవస్థ పని విధానం, గణిత ఫార్ములాను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరిశీలించారు. డైరెక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, రాజేశ్, సుధాకర్, సుస్మిత, నరేశ్, గౌరి తదితరులు ఉన్నారు.